(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 186 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 14-04-2026 పేజీలు : 6 Digital Edition

### జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని

# బీజేపీ చూస్తోంది



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్

జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఆయన ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని ఆయన పేర్కొన్నారు. కానీ

మిగతా 2

### ఏపీలో పరిశ్రమల ఏర్పాటు

# మరింత సులభం...

- బ్రిటీష్ కాలం నాటి చట్టాల రద్దుపై చంద్రబాబు కీలక ఆదేశాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు



వివరాలు 2



21వ శతాబ్దం

## మహిళలదే..

- కొత్త చరిత్రను లిఖించనున్నాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

వివరాలు 2




### తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో

# హెల్త్ ఏటీఎంలు..

### నిమిషాల్లో 130 రకాల పరీక్షలు!

హైదరాబాద్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షల కోసం గంటల తరబడి నిరీక్షించే అవస్థలకు, రిపోర్టుల కోసం రోజుల తరబడి ఎదురుచూసే ఇబ్బందులకు ముగింపు పలికేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమైంది. వైద్యారోగ్య శాఖను బలోపేతం చేయడంలో భాగంగా పేద రోగులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా "హెల్త్ ఏటీఎం"లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ఏటీఎంల ద్వారా కేవలం నిమిషాల వ్యవధిలోనే దాదాపు 130 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని కింగ్ కోఠి, మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రారంభించారు. అక్కడ ఈ యంత్రాలు అద్భుతమైన ఫలితాలను ఇవ్వడంతో అధికారులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. హెల్త్ ఏటీఎంల ద్వారా వచ్చిన పరీక్ష ఫలితాలను, టీ-డయాగ్నోస్టిక్స్, ప్రముఖ ప్రైవేట్ ల్యాబ్‌ల రిపోర్టులతో పోల్చి చూడగా, ఫలితాల్లో కచ్చితత్వం ఉండటంతో ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని

మిగతా 2



రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు


## రాజ్యాంగ విరుద్ధం

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

వివరాలు 2

## టీజీ టెట్-2026 షెడ్యూల్ విడుదల

వివరాలు 2



## తిరుమల కొండపై అక్రమ వసూళ్లు...

### ఉద్యోగిపై వేటు వేసిన టీటీడీ

తిరుమలలో భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఓ ఉద్యోగిపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కఠిన చర్యలు తీసుకుంది. లగేజీ సెంటర్‌లో పనిచేస్తున్న నరసింహారెడ్డి అనే ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించింది.

వివరాలు 2



### ఎల్బీనగర్-హయత్‌నగర్ రూట్‌లో డబుల్ డెక్కర్..

# ఫ్లైఓవర్‌పైనే మెట్రో!

వివరాలు 2

# ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం...

**అమరావతి**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు, నిబంధనలను సులభతరం చేసేందుకు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను తొలగించి, వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆర్డినెన్స్‌లు జారీ చేసి అయినా సరే, సంస్కరణలను వేగంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని బృందం సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కేంద్ర బృందంతో సీఎం సమీక్ష.. మే నాటికి ఫేజ్-2 పూర్తి లక్ష్యం**

కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం, రాష్ట్రంలో డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో విస్తృతంగా చర్చించింది. పరిశ్రమల ఏర్పాటులో వేగాన్ని పెంచడం, అనుమతులను సులభతరం చేయడం, అనవసర నిబంధనలను తొలగించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ఆయా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో భాగంగా 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఫేజ్-2లో 28 అంశాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అధికారులు వివరించారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**బ్రిటీష్ చట్టాల రద్దు.. అనుమతుల సరళీకరణపై కీలక ఆదేశాలు**

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని, క్లిష్టతను పూర్తిగా తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు, లైసెన్సుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని ఆదేశించారు. అయితే, ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అనవసర వేధింపులు తగ్గించేందుకు థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని సూచించారు. వ్యాపార రిజిస్ట్రేషన్లకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ విషయంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలంగా ఉండే సరళమైన నిబంధనలు అమలు చేయాలని, ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు పట్టే సమయం కనీసం 40 శాతం తగ్గాలని నిర్దేశించారు.

**ఒకే శాఖలో అనుమతుల విలీనం.. అవసరమైతే ఆర్డినెన్సులు**

డి-రెగ్యులేషన్ ఫేజ్-2ను వేగంగా అమలు చేయడానికి అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం ఉన్న 82 రకాల అనుమతులను దశలవారీగా 57కు తగ్గించాలని సూచించారు. బిల్డింగ్ ప్లాన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వంటి వాటికి సంబంధించిన 30 ప్రక్రియలను 18కి తగ్గించాలని చెప్పారు. ఒకే శాఖ పరిధిలోని పలు అనుమతులను విలీనం చేయడం, కొన్నింటికి అనుమతులు కాకుండా కేవలం ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలకు కొనసాగింపుగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అన్ని అనుమతులు ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అఫిడవిట్‌తో వ్యాపారం.. డిజిటలైజేషన్‌కు పెద్దపీట**

పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పించే దిశగా, అఫిడవిట్ ఆధారంగానే వ్యాపారం ప్రారంభించే అవకాశాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిర్దిష్ట కాలం పాటు తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో అనుకూల వాతావరణం సృష్టించాలని అన్నారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగం నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు.

దరఖాస్తు నుంచి అనుమతి వరకు మొత్తం ప్రక్రియను డిజిటలైజ్ చేయాలని, దీనివల్ల పారదర్శకత పెరుగుతుందని వివరించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర' వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సేవలను సులభతరం చేయాలని ఆదేశించారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

**ఏపీ పనితీరు అద్భుతం.. ఫేజ్-3లో ఏఐకి ప్రాధాన్యం**

డి-రెగ్యులేషన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపిస్తున్న చొరవను, పనితీరును కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ప్రశంసించారు. కేంద్రం ప్రతిపాదించిన అంశాల కంటే ఏపీ మెరుగ్గా పనిచేస్తోందని, నిర్దేశిత గడువులోగా ఫేజ్-2ను పూర్తి చేస్తుందన్న నమ్మకం ఉందని అన్నారు.

దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, 'నేషన్ ఫస్ట్' నినాదంతో పనిచేస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానానికి మారామని తెలిపారు. అటవీ చట్టాలను కూడా సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్ వంటి వ్యవస్థలను వినియోగిస్తున్నామని వారికి వివరించారు.

# 21వ శతాబ్దం మహిళలదే..

**న్యూఢిల్లీ:**

మహిళా రిజర్వేషన్ చట్టంతో (నారీ శక్తి వందన్ అధినియం) ముడిపడిన సవరణ బిల్లు పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ముందుకు వస్తోందని, రిజర్వేషన్ బిల్లు మహిళలకు సముచిత స్థానం కల్పించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 21వ శతాబ్దంలో అతి కీలకమైన నిర్ణయం తీసుకోబోతున్నామని, పార్లమెంటు కొత్త చరిత్రను లిఖించేందుకు చేరువలో ఉందని చెప్పారు. ఢిల్లీలో సోమవారంనాడు నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. పాలనలో మహిళల భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలతో తెరపడనుందని మోదీ ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం మహిళలకు అంకితమని అన్నారు. 21వ శతాబ్దం మహిళలదేనని, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుతో చిరకాల స్వప్నాల సాకారంతో పాటు భవిష్యత్ సంకల్పాలు నెరవేరుతాయని అన్నారు. సామాజిక న్యాయం కేవలం పురుషుల వల్ల మాత్రమే కాదని, భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో లింగ సమానత్వం, సామాజిక న్యాయం సాకారమవుతుందని పేర్కొన్నారు. 'మహిళా సాధికారతా బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ 2029 నుంచి అమలు చేయాలనే ఏకగ్రీవ డిమాండ్ ఉంది. 2029 గడువును దృష్టిలో ఉంచుని దీనిపై సమగ్ర చర్చను ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చేపట్టనున్నాం' అని మోదీ తెలిపారు. పరస్పర సహకారం, పార్టిసిపేషన్‌తో ఈ పని నిర్వహించాలని తమ అభిమతమని, ఈసారి కూడా ప్రతి ఒక్కరి సమష్టి కృషితో సభాగౌరవం సమున్నత శిఖరాలకు చేరుకోబోతుందని అన్నారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకూ మూడు రోజుల పాటు మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడిన సవరణలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేకంగా సమావేశమవుతోంది. 20029 నుంచి లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను కచ్చితంగా మహిళా రిజర్వేషన్లతో నిర్వహించుకుందామని ప్రధాని ఇప్పటికే పిలుపునిచ్చారు. ఇందుకోసం రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి సవరణ బిల్లులను ఆమోదించాలని వివిధ పార్టీల లోక్‌సభ, రాజ్యసభాపక్ష నాయకులకు మోదీ లేఖ రాశారు. దేశ మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో ఎంపీలంతా ఏకమై మాట్లాడాలని, చరిత్రాత్మక మార్పునకు నాందీ పలకాలని ఆ లేఖలో కోరారు.

# తిరుమల కొండపై అక్రమ వసూళ్లు...

**తిరుపతి**

తిరుమలలో భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఓ ఉద్యోగిపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కఠిన చర్యలు తీసుకుంది. లగేజీ సెంటర్‌లో పనిచేస్తున్న నరసింహారెడ్డి అనే ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించింది. తిరుమలలోని లగేజీ డిపాజిట్ కేంద్రంలో నరసింహారెడ్డి భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు టీటీడీ దృష్టికి వచ్చింది. విచారణ జరిపిన అధికారులు, ఆరోపణలు నిజమని తేలడంతో అతడిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించారు. వాస్తవానికి టీటీడీ భక్తులకు లగేజీ డిపాజిట్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. ఈ సేవలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని టీటీడీ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని భక్తులను కోరింది. అలాంటి ఘటనలు ఎదురైతే, టీటీడీ విజిలెన్స్ కంట్రోల్ నంబర్ 9866898630కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించింది. భక్తులకు అందించే ఉచిత సేవల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టీటీడీ హెచ్చరించింది.

# టీజీ టెట్-2026 షెడ్యూల్ విడుదల...

తెలంగాణలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనుకుంటున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్-జూన్-2026) నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సోమవారం జారీ చేసింది. ఈ పరీక్షలను జూన్ 15 నుంచి జూన్ 30వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT) పద్ధతిలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం, ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం టీజీటెట్‌ను నిర్వహిస్తోంది. డీఈడీ/డీఎల్ఎడ్, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ లేదా తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ స్కోర్‌ను మెరుగుపరచుకోవడానికి కూడా మళ్లీ పరీక్ష రాయవచ్చని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించాలనుకునే వారు పేపర్-I రాయాల్సి ఉంటుంది. 6 నుంచి 8వ తరగతి వరకు బోధించేందుకు పేపర్-IIలో అర్హత సాధించాలి. రెండు కేటగిరీలకూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకూ హాజరు కావచ్చు. పరీక్ష ఫీజును జనరల్, బీసీ అభ్యర్థులకు ఒక పేపర్‌కు రూ. 750, రెండు పేపర్లకు రూ. 1000గా నిర్ణయించారు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఒక పేపర్‌కు రూ. 700, రెండు పేపర్లకు రూ. 950గా ఫీజు ఖరారు చేశారు.

### జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని

# బీజేపీ చూస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

లోక్ సభ సీట్ల పెంపు విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. లోక్ సభ సీట్ల పెంపు విషయంపై అఖిల పక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. లోక్ సభ సీట్ల పెంపు, మహిళా రిజర్వేన్లు వేర్వేరనేది ప్రతి పౌరుడికి తెలుసని అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు ఈ విధానం అన్యాయం చేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పార్టీకైనా జాతీయ ప్రయోజనాలే ముఖ్యంగా ఉండాలని అన్నారు. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం దామాషా పద్ధతి కాకుండా మరో విధానాన్ని అనుసరించాలని కోరారు. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో ఈ అంశంపై ముందుకు వెళ్లాలని సూచించారు.

# రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

**హైదరాబాద్**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. "అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన. అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?" అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెల్త్ ఏటీఎంలు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పేద, సామాన్య ప్రజలకు వేల రూపాయలు ఖర్చయ్యే కీలక వైద్య పరీక్షలు ఇకపై సులభంగా, వేగంగా అందనున్నాయి. క్లౌడ్ ఆధారిత టెక్నాలజీతో పనిచేసే ఈ హెల్త్ ఏటీఎంల ద్వారా బీపీ, ఈసీజీ, శరీరంలోని కొవ్వు శాతం, ఆక్సిజన్ స్థాయిలు, ఉష్ణోగ్రత వంటి 65 రకాల ప్రాథమిక పరీక్షలను నిమిషాల్లో పూర్తి చేయవచ్చు. వీటితో పాటు రక్త నమూనాల ద్వారా గ్లూకోజ్, హిమోగ్లోబిన్, లిపిడ్ ప్రొఫైల్, కాలేయం, కిడ్నీ పనితీరు, థైరాయిడ్ వంటి కీలక పరీక్షలు కూడా నిర్వహిస్తారు. అంతేగాక గర్భిణుల కోసం ఫీటల్ డాప్లర్, చర్మ వ్యాధుల నిర్ధారణకు డెర్మాస్కోప్ వంటి ప్రత్యేక సదుపాయాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవస్థను మరింత పారదర్శకంగా, రోగికి సౌకర్యవంతంగా మార్చేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా)తో అనుసంధానించారు. దీనివల్ల రోగి చేయించుకున్న ప్రతి పరీక్ష రిపోర్ట్ డిజిటల్ రూపంలో వారి అభా కార్డులో భద్రంగా ఉంటుంది. పరీక్ష పూర్తయిన వెంటనే రిపోర్టులు నేరుగా రోగి మొబైల్ ఫోన్‌కు వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా చేరతాయి. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేని గ్రామీణ ప్రజలకు సహాయపడేందుకు ప్రతి ఏటీఎం వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు. అయితే, ఒక రోగికి అన్ని పరీక్షలు పూర్తి చేయడానికి దాదాపు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతుండటం పైలట్ ప్రాజెక్టులో ఒక సవాలుగా నిలిచింది. ఈ సమస్యను అధిగమించడానికి, రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన ఆసుపత్రుల్లో రెండు లేదా మూడు హెల్త్ ఏటీఎం యూనిట్లను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. త్వరలోనే ఈ సదుపాయాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు విస్తరించేందుకు వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

# ఎల్బీనగర్-హయత్‌నగర్ రూట్‌లో డబుల్ డెక్కర్.. ఫ్లైఓవర్‌పైనే మెట్రో!

నగరంలోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఎల్బీనగర్-హయత్‌నగర్‌పై ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మార్గంలో మెట్రో రైలు మార్గంతో పాటు ఫ్లైఓవర్‌ను కలిపి 'డబుల్ డెక్కర్' విధానంలో నిర్మించాలనే ప్రతిపాదన బలంగా ముందుకు వచ్చింది. ఇప్పటికే మెట్రో కోసం పంపిన డీపీఆర్‌ను పక్కనపెట్టి, ఈ కొత్త ప్రణాళికకే అనుమతి ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రాన్ని కోరుతున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (=వీ=ా) సుమారు ఏడాదిన్నర క్రితం ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల మెట్రో మార్గానికి సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)ను కేంద్రానికి పంపింది. అయితే, ఇదే మార్గంలో జాతీయ రహదారి-65 విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ (=ఒడీ) ఇటీవల ఓ కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. 5.5 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. నాగ్‌పూర్ తరహాలో కింద సాధారణ రహదారి, మొదటి అంతస్తులో మూడు లేన్ల ఫ్లైఓవర్, దానిపైన రెండు వరుసల మెట్రో రైలు మార్గం నిర్మించేలా డిజైన్ రూపొందించింది. జాతీయ రహదారి-65పై విపరీతమైన రద్దీ, తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఈ మార్గాన్ని విస్తరిస్తున్నారు. అయితే, మెట్రో, ఫ్లైఓవర్‌ను వేర్వేరుగా నిర్మిస్తే భవిష్యత్తులో మళ్లీ రోడ్డు విస్తరణ, నిర్మాణ ఇబ్బందులు తప్పవని అధికారులు భావిస్తున్నారు. డబుల్ డెక్కర్ నిర్మాణంతో ఒకేసారి రెండు సమస్యలు పరిష్కారమవుతాయని, బేగంపేటలో మాదిరిగా ఇళ్ల సమీపం నుంచి మెట్రో వెళ్లడం, శబ్ద కాలుష్యం వంటి సమస్యలను నివారించవచ్చని చెబుతున్నారు. సర్వీస్ రోడ్లు కూడా స్తంభాలు లేకుండా సాఫీగా ప్రయాణానికి వీలవుతుందని స్థానికులు ఈ ప్రతిపాదనను స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఒకవేళ డబుల్ డెక్కర్ నిర్మాణానికే కేంద్రం ఆమోదం లభిస్తే, HMRL సమర్పించిన పాత మెట్రో డీపీఆర్‌లో మార్పులు చేయడం అనివార్యం కానుంది.

## అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమం -- అవగాహన సమావేశాలు మరియు కమిటీలు ఏర్పాటు




**బోనకల్ ఏప్రిల్ 13 ప్రజావేదిక ప్రతినిధి (తెల్లబోయిన సుమన్)**

బోనకల్ మండలం చిరునోముల గ్రామంలో 'అరైవ్ ఢ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా మరియు రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన చొరవకు అనుగుణంగా, బోనకల్ మండలంలోని వివిధ గ్రామాలలో అవగాహన సమావేశాలు మరియు గ్రామ సభలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలు బోనకల్ సబ్-ఇన్‌స్పెక్టర్ చురుకైన భాగస్వామ్యంతో నిర్వహించబడ్డాయి. ఇందులో ప్రజలకు హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం, మరియు రహదారి క్రమశిక్షణను పాటించడం వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా, బోనకల్ సబ్-ఇన్‌స్పెక్టర్ చిరునోముల గ్రామంలో సర్పంచ్ మరియు స్థానిక యువ నాయకుల సమక్షంలో పాల్గొని, రహదారి భద్రత మరియు ప్రమాదాల నివారణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అంతేకాకుండా, మండలం వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీలలో రహదారి భద్రతా కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కమిటీలు బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించడం మరియు రహదారి భద్రతా చర్యల అమలుకు మద్దతు ఇవ్వడం లో కీలక పాత్ర పోషిస్తాయి.

ఈ చొరవ ప్రజాపాలన కింద రాష్ట్ర ప్రభుత్వం రహదారి ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా కలిగి ఉంది. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పొదిల. వెంకన్న తెలిపారు.

## కాచనపల్లిలో మొక్కజొన్న పంట నష్టంపై వ్యవసాయ అధికారుల పరిశీలన.



**బయ్యారం, ప్రజా వేదిక న్యూస్, ఏప్రిల్ 13.**

బయ్యారం మండలం కాచనపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటనపై మండల వ్యవసాయ అధికారి కే. రాజు ఆధ్వర్యంలో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ యాల రేవతి, వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల్, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు, అగ్ని ప్రమాదం వల్ల సుమారు 6 ఎకరాల మేరకు మొక్కజొన్న పంట నష్టపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో పాయం శేఖర్, ముడిగ వజ్జయ్య, భూతం వెంకన్న, పాయం సారయ్య, కిన్నెర ఆదెమ్మ, వేప శ్రీను లకు చెందిన మొక్కజొన్న పంట దగ్ధమయ్యాయి. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుండి అందుబాటులో ఉన్న పరిహారం, ఇతర సహాయక చర్యలపై వారికి అవగాహన కల్పించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని రైతులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ శాఖ రైతులకు ఇలాంటి ప్రమాదాల నివారణ కోసం విద్యుత్ లైన్ల సమీపంలో జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

## సింగారంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంపై అవగాహన.



**బయ్యారం, ప్రజా వేదిక న్యూస్, ఏప్రిల్ 13.**

బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రమాదాల నివారణకు గ్రామస్తులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, బయ్యారం మండల సిఐ, ఎస్ఐ ఆదేశానుసారం గ్రామ సర్పంచ్, గ్రామ పోలీస్, స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొనగా సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత గురించి వివరిస్తూ ప్రజల తమ ప్రాణాల భద్రతకు, మన కుటుంబాల భవిష్యత్తు గురించి వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించకుండా జాగ్రత్తగా గమ్యం చేరాలని సూచించారు. గ్రామంలో రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమతా సాయికిరణ్, వార్డు సభ్యులు చుంచు అనిల్ కుమార్, చెరుకుపల్లి మనీషా, బాధవత్ లల్యా నాయక్, గుగులోత్ అనూష, బానోత్ సరితా, సపవత్ అనిత, గంగావత్ పద్మ, చుంచు సుగుణ, సపవత్ గోపి, చాట్ల వెంకన్న, చెరుకుపల్లి రవి, గుగులోత్ మహేష్, గుగులోత్ రెడ్యా, గుగులోత్ స్వరూపరాణి, చుంచు బాలరాజు, సంతోష్, బాబురావు వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నాగులవంచ గ్రామంలో వినూత్నంగా డికాల్బ్ మొక్కజొన్న కంకులతో దేవాలయ గోపురం అలంకరణ

**బోనకల్ ఏప్రిల్ 13 ప్రజావేదిక ప్రతినిధి (తెల్లబోయిన సుమన్)**

నాగులవంచ గ్రామంలో నేడు బాయర్ కంపెనీ నిర్వహించిన మొక్కజొన్న ప్రదర్శన క్షేత్ర సందర్శన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా కంపెనీ ప్రతినిధులు మొక్కజొన్న కంకులతో దేవాలయ గోపురం ఆకారంలో అద్భుతంగా పొలాన్ని అలంకరించారు.

ఈ వినూత్న అలంకరణను చూసిన సందర్శకులు, రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ, ఇటువంటి సృజనాత్మక కార్యక్రమాలు వ్యవసాయంపై ఆసక్తిని పెంచుతాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మొక్కజొన్న కంకులతో గోపురం నిర్మాణం అందరినీ



ఆకర్షించింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు అశోక్ రెడ్డి, నారాయణ, భార్గవి డీకాల్బ్ 9217 రకం మొక్కజొన్న పంట యొక్క ముఖ్య లక్షణాలు మంచి వేరు వ్యవస్థ, బలమైన కాండం, సమానమైన మరియు నిండుగా ఉండే కంకులు ఉండటం వల్ల అధిక దిగుబడి సాధ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర రావు మరియు డిస్ట్రిబ్యూటర్ రామ బ్రహ్మం మాట్లాడుతూ బలమైన వేరు వ్యవస్థ ఉండడం వల్ల వడగాలులకు మరియు అకాలవర్షాలకు తట్టుకొని అధిక దిగుబడి వస్తుందని వివరించారు అలాగే కంపెనీ చేపట్టిన ఈ వినూత్న ప్రచార కార్యక్రమాన్ని గత నాలుగు రోజుల నుండి వివిధ చుట్టు పక్కల గ్రామాల రైతులు వీక్షిస్తూ హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది డీలర్లు పాల్గొన్నారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరితంగా, విజయవంతంగా జరిగింది.

## ఎస్బిఐ సేవలను సద్వినియోగం చేసుకోండి

**-ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్**

**చింతకాని ఏప్రిల్ 13 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ మండల ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామంలో మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పందిళ్ళపల్లి బ్రాంచ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవితంలో పొదుపు అనేది చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆర్థిక అవసరాలు నిమిత్తం బ్యాంకుల్లో పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, విద్యుత్, ప్రణాళిక ప్రణాళిక శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క చొరవతో పందిళ్ళపల్లికి ఎస్బిఐ బ్యాంక్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. మానవ జీవితంలో పొదుపు చేయడం అత్యంత ఆవశ్యకత కూడుకొని ఉన్నదన్నారు. ప్రజలు తమ ఆర్థిక అవసరాలకు బ్యాంకుల్లో నగదును పొదుపు చేయడం ఎంతో ఉపయోగకరమని ప్రజలందరూ తమ సంపాదనలో కొంత మొత్తం పొదుపు చేసి ఆర్థిక అవసరాలకు సరైన సమయంలో లబ్ధి పొందాలని సూచించారు. ఖాతాదారులు బ్యాంకుల్లో పొదుపు చేయడంతో పాటు అవసరానికి అనుగుణంగా రుణం తీసుకుని సకాలంలో ఆ రుణాలు చెల్లించినప్పుడు బ్యాంకులు





సమర్థవంతంగా పని చేయుటకు అవకాశం ఉంటుందన్నారు. పందిళ్ళపల్లిలో ఎస్బిఐ బ్రాంచ్ ఏర్పాటు లింగం రాంబాబు ఎంతగానో కృషి చేశారని గ్రామం పట్ల ఆయనకున్న నిబద్ధతను కొనియాడారు. పందిళ్ళపల్లి గ్రామం తో పాటు బొప్పారం, గాంధీ నగర్, అనంతసాగర్, మత్తేపల్లి, రామకృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్బిఐ సేవలను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. ప్రజల ఆర్థిక అవసరాల నిమిత్తం ఎస్బిఐ బ్యాంకు ఎన్నో వినూత్న పథకాలను ప్రజలకు అందుబాటులో ఉంచిందన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనం ప్రభాకర్ రెడ్డి, బ్యాంకు మేనేజర్ నిషార్, చీఫ్ మేనేజర్లు ఫయాద్, రాంబ్రహ్మం, శ్రీలక్ష్మి , క్యాషియర్ హఫీజ్ భాష, చింతకాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగం రాంబాబు, గాంధీనగర్ గ్రామ సర్పంచ్ ఓర్సు వీరభద్రం, బొప్పారం గ్రామ సర్పంచ్ ఎస్.కె రహమతుల్లా, కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున, కంచం కోటేశ్వరరావు, గాదె రామారావు, వంగూరి రమేష్, ఇనుకుళ్ళ నాగ సూరారెడ్డి, దేవరపల్లి సుధాకర్ రెడ్డి, కిలారు వెంకటేశ్వర్ రెడ్డి, కొమ్మినేని నాగేశ్వరరావు, గుండా సత్యనారాయణ, సిపిఎం నాయకులు వత్సవాయి జానకి రాములు, బిఆర్ఎస్ నాయకులు మేకల ప్రసాద్ రావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోటగడ్డ జిపిలో రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు.

-పంచాయతీని గంజాయి రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం.
-గ్రామస్తులు హెల్మెట్ ధరించాలని తీర్మానం.
-సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పాలకవర్గం ప్రతిజ్ఞ.

**బయ్యారం, ప్రజా వేదిక న్యూస్, ఏప్రిల్ 13.**

బయ్యారం మండలంలోని కోటగడ్డ గ్రామపంచాయతీని గంజాయి రహిత గ్రామంగా మార్చడమే లక్ష్యంగా, హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని, హెల్మెట్ మా గ్రామంలో వాహనదారులు ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని పంచాయతీ పాలకవర్గంతో సీఐ రవీందర్ ప్రతిజ్ఞ చేపించారు. గ్రామ సర్పంచ్ కాయం వరలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేశారు. గార్ల బయ్యారం సీఐ రవీందర్ పర్యవేక్షణలో గ్రామ ప్రజలకు గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, హెల్మెట్, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పంచాయతీలో కీలక కూడళ్లలో




సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పాలకవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు సందీప్, వెంకన్న, కుమార్, జ్యోతి, పురుషోత్తం, శిరీష, అపర్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై అవగాహనా






**చింతకాని ఏప్రిల్ 13 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు**

ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని చింతకాని ఎస్సై వీరేందర్ అన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, మరణాల రేటును తగ్గించేందుకు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా ప్రజలను సమాయత్వం చేసేందుకు ఈరోజు చింతకాని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం అరైవ్ అలైవ్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని నుండి జగన్నాథపురం వెళ్లే మార్గమధ్యంలో రోడ్లపై అడ్డుగా వున్న చెట్ల పొదలను తొలగించి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు

ఈ కార్యక్రమంలో వైరా సీఐ వెంకట ప్రసాద్, చింతకాని సర్పంచ్ మనోహర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో రోడ్డు సేఫ్టీ కమిటీలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

## ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో సత్తా చాటిన షైన్ హై స్కూల్ విద్యార్థిని మొగుళ్లపల్లి సాయి హర్షిని :వెంకటేశ్వర్లు..





బోనకల్ ఏప్రిల్ 13 ప్రజావేదిక ప్రతినిధి (తెల్లబోయిన సుమన్)

స్థానిక షైన్ హై స్కూల్ విద్యార్థిని పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన మొగుళ్లపల్లి సాయి వర్షిణి నిన్న విడుదల చేసిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో స్టేట్ 2వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ మానేజ్మెంట్ మరియు స్టాఫ్ సాయి హర్షినికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు..ఈ సందర్భంగా విద్యార్థిని సాయి హర్షిని మాట్లాడుతూ 470 కి గాను 468 మార్కులు సాధించినట్లు తెలిపారు. తను ఈ విజయం సాధించడానికి తల్లిదండ్రులు ఒక కారణం అయితే షైన్ హై స్కూల్ కూడా మరొక ముఖ్య కారణం అన్నారు...తను నర్సరీ నుంచి 10వ తరగతి వరకు ఇక్కడే చదువుకున్నాను అని చెప్పారు. పాఠశాల కరెస్పాండంట్ అన్సర్ పాషా మాట్లాడుతూ మన షైన్ హై స్కూల్ ఎప్పుడు విద్యార్థుల విజయానికి చిరునామా గా ఉంటుంది అని, విద్యార్థులను పోటీ ప్రపంచానికి దీటుగా తయారుచేయడమే వారి లక్ష్యం అన్నారు. విద్యకి మాత్రమే వ్యక్తి తలరాత మార్చే శక్తి ఉందని, అలాంటి విద్య అందించే విషయం లో ఎప్పుడు ముందు ఉంటామని,విద్యార్థుల బంగారు భవిషత్తు కి బాటలు వేయడానికి తాము ఎల్లప్పుడూ కృషి చేస్తాం అని అన్నారు..విద్యార్థిని తండ్రి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం అయినప్పటికి, విద్యార్థుల చదువు విషయం లో ఎక్కడ వెనకడుగు వేయకుండా, పోటీ ప్రపంచానికి తగ్గట్లుగా విద్యార్థులను తీర్చి దిద్దు తున్న షైన్ హై స్కూల్ మానేజ్మెంట్ మరియు ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు..ఈ కార్యక్రమం లో కరెస్పాండంట్ షేక్ అన్సర్ పాషా, డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ డేగల వేలాద్రి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఆడపిల్లలకు చేయూతనిస్తున్న పిండిప్రోలు హై స్కూల్ పూర్వ విద్యార్థులు



తిరుమలాయపాలెం ఏప్రిల్ 13 ( ప్రజా వేదిక ) న్యూస్ ప్రతినిధి

చేయి చేయి కలిస్తేనే చప్పట్లు మోగుతాయి.. చినుకు చినుకు కలిస్తే వరదై, వరదలే కాస్త వేరులై, అవి కాస్త నదులవుతాయి. అలాగే పూర్వ విద్యార్థులందరూ కలిస్తే ఎలాంటివారికైనా ఆర్థికంగా చేయూతనివ్వచ్చని నిరూపిస్తున్నారు 1994 95 పూర్వ విద్యార్థులు.

జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పిండిప్రోలు గ్రామంలో 1994 1995 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులందరూ ఐక్యంగా నిలబడి తోటి విద్యార్థి మిత్రులు అనుకోని పరిస్థితుల్లో చనిపోయినప్పుడు వారి కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. 2009లో 1994-95 బ్యాచి మొదటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాఠశాలలో జరిగింది. 2013లో జనవరిలో 94-95 బ్యాచ్ రెండోసారి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఒక వేదిక నిర్మించుకోవాలని గొప్ప ఆలోచన ఉద్భవించింది. అనుకున్నదే తడవుగా 1,50,000తో ఈ వేదికను పూర్తి చేశారు. 2019లో తోటి మిత్రుడు పెరుగు ఉపేందర్ అకాల మరణానికి గురయ్యారు. మళ్లీ పూర్వ విద్యార్థులందరూ ఏకమై ఈ సందర్భంగా ఉపేందర్ కూతురికి ఆర్థిక సహాయంగా 42 వేల రూపాయలను ఫిక్స్ డిపాజిట్ చేయడం జరిగింది. ఈ అమౌంటు అమ్మాయి పెళ్లికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఇటీవల కాలంలో ఐతనబోయిన రవికుమార్ కూడా చనిపోయారు. మళ్లీ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు అందరూ తలా ఒక చేయి వేసి రవికుమార్ కూతురు ఐతనబోయిన మైత్రి పేరుమీద 26వేలను పిండిప్రోలు ఐఓబి బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండును వారి కుటుంబానికి అందజేశారు. ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న 1994-95 బ్యాచ్ విద్యార్థులు ఇతర బ్యాచ్ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో మీగడ సైదులు, మేకల సత్యనారాయణ, మడికంటి స్కైలాబ్, రామనబోయిన వెంకటేశ్వర్లు, తోము వెంకటేశ్వర్లు, భాషణ బోయిన వీరభద్రం తదితరులు ఉన్నారు.

# బొప్పారం గ్రామంలో రైతుల పట్టాదారు పుస్తకంపై మొబైల్ లింక్ పై అవగాహన కార్యక్రమం.

### - ఏ డి ఏ స్వర్ణ విజయ్ చంద్ర మరియు ఏవో మానస ఆధ్వర్యంలో.

చింతకాని ఏప్రిల్ 13

ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు



చింతకాని మండల పరిధిలో బొప్పారం గ్రామంలో రైతుల పట్టాదారు పుస్తకం మొబైల్ లింక్ ఆఫ్ ఆప్షన్ అవగాహన కార్యక్రమం చేపట్టినారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ డి ఏ స్వర్ణ విజయ చంద్ర మరియు ఏవో మానస ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడిఏ స్వర్ణ విజయచంద్ర మాట్లాడుతూ... బొప్పారం గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న పత్తి రైతు మొబైల్ లింక్ ద్వారా ఏ సీజన్లో ఏ పంటలు వేయాలి,పత్తి విత్తనాలు, నాన్యమైన విత్తనాల సమృద్ధి గురించి లింకు ద్వారా తెలుసుకోవచ్చని తెలియజేశారు. ఏవో మనసు మాట్లాడుతూ.... మొక్కజొన్న తేమ శాతం లేకుండా జాగ్రత్తగా చూసుకోని మార్కెడ్ కేంద్రాలు ద్వారా పత్తి రైతు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని తెలియపరిచారు. గ్రామ సర్పంచ్ షేక్ రహమతుల్లా మాట్లాడుతూ... మొక్కజొన్న రైతులు గన్నీ బ్యాగులు లేక రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గన్ బ్యాగులు 30 రూపాయలు నుంచి 40 దాకా రైతుల కొనుక్కునే పరిస్థితి వస్తుందని, రైతు పండించిన పంటకు సరైన సౌకర్యాలు లేక రైతులు తమ గోడును ఎవరికి చెప్పుకోలేక రైతులు తీవ్రర ఇబ్బందులు పడుతున్నారని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఏవో మానస ఏఈఓ కార్తీక్,

సర్పంచ్ షేక్ రహమతుల్లా, గ్రామ మాజీ సర్పంచులు, రైతులు కౌలు రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం తనిఖీ.

### -మండల వ్యవసాయ అధికారి కే.రాజు

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 13.





బయ్యారం మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి కే. రాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరపై అవగాహన కల్పించారు.రైతులు తమ పంటను మధ్యవర్తులకు అమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని,మధ్యవర్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించవద్దని సూచించారు.

ఈ సందర్భంగా అగ్రి-ఎంఎస్ పి పోర్టల్‌లో రైతు నమోదు ప్రక్రియపై ఒక రైతుతో ప్రత్యక్ష ప్రదర్శన చేశారు. నమోదు విధానం,అవసరమైన వివరాలు,ప్రక్రియపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. బయ్యారం సోసైటీలో నిర్వహిస్తున్న అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో బయోమెట్రిక్ ధృవీకరణ విధానం గురించి చర్చించారు.రైతుల బయోమెట్రిక్ వివరాలు అగ్రి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయబడతాయని,ప్రతి రైతుకు రెండు దఫాలుగా ధృవీకరణ జరుగుతుందని తెలిపారు.మొదటిది నమోదు సమయంలో,రెండవది పంట లోడ్ చేసేముందు నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు.ఇప్పటి వరకు బయ్యారం మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో మొత్తం 10,451 క్వింటాళ్లు 150 మంది రైతులకు సంబందించిన మొక్కజొన్న కొనుగోళ్లు జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు,వ్యవసాయ విస్తరణ అధికారులు సోసైటీ సీఈఓ,కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# తిర్లాపురం గ్రామంలో‘అరైవ్ అలైవ్’ ప్రోగ్రామ్.రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం.

చింతకాని ఏప్రిల్ 13

ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు



చింతకాని మండలం తిర్లాపురం గ్రామం పంచాయతి కార్యాలయంలోని చింతకానిపోలీసుల ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అధ్యక్షతన సోమవారం ‘అరైవ్ అలైవ్’ రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలోభాగంగా గ్రామస్థాయిలో రోడ్డు సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని, ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు.

మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు, ఎండలు, విపత్తులు.. ఏ పరిస్థితుల్లోనైనా పోలీసులు ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు.

పడినచోట ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి పోలీసులు గౌరవం అందిస్తున్నారని, ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు.

‘అర్రివ్ అలైవ్’ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే కాకుండా, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామ సెక్రెటరీ ఉమారాణి, గ్రామ ఉపసర్పంచ్, గోగుల నాగమణి నరసింహారావు, గోద రాధమ్మ, వెంకయ్య, రాములు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వేరోస్ కొండ్రు రామచంద్రుకి అరుదైన గౌరవం

ఆయన చేసిన విశిష్ట సేవలకు గాను
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు కు ఎంపిక...

తిరుమలాయపాలెం ఏప్రిల్ 13 ( ప్రజా వేదిక ) న్యూస్ ప్రతినిధి



తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన కొండ్రు రామచంద్రుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు రావడం గ్రామానికే కాకుండా మొత్తం ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన, తన వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా సమాజాన్ని కూడా ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో సేవా మార్గాన్ని ఎంచుకున్నారు.గత కొన్ని సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలు పరిశీలిస్తే, అది కేవలం సహాయం చేయడం కాదు, ఒక బాధ్యతగా భావించి చేసిన కృషి అని స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామంలో ఎవరైనా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు, వైద్య అవసరాలు వచ్చినప్పుడు, విద్య కోసం సహాయం అవసరమైనప్పుడు---తనకు ఉన్న పరిమితుల మధ్యే అయినా ముందుకు వచ్చి సహాయం చేసిన వ్యక్తిగా రామచంద్రుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, పేద విద్యార్థులకు తోడ్పాటు ఇవ్వడం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ఆయన సేవా స్ఫూర్తికి నిదర్శనం.

ఇలాంటి నిస్వార్థ సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ, ఆయనను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం ద్వారా సమాజానికి సేవ చేసే వారికి ప్రోత్సాహం అందించింది. ఈ అవార్డు కేవలం ఒక వ్యక్తికి మాత్రమే కాదు, సమాజ సేవ పట్ల ఉన్న విలువలకు ఇచ్చిన గౌరవంగా భావించవచ్చు.ఈ నెల 19న

హైదరాబాద్‌లోని భాగ్ లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందజేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రామచంద్రు వంటి సేవామూర్తుల కృషి మరింత మందికి తెలిసి, యువతలో సేవా స్ఫూర్తి పెంపొందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.రఘునాథపాలెం గ్రామ ప్రజలు, ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నారు.

# బోడులబండ గ్రామంలో రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహించారు.



నేలకొండపల్లి ఏప్రిల్ 13
ప్రజావేదిక న్యూస్

నేలకొండపల్లి మండల పరిధిలోని బోదులబండ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో సోమవారం రోడ్డు భద్రత అవగాహన సదస్సు సర్పంచ్ కట్టెకోల నాగార్జున, కూసుమంచి సీఐ సంజీవ్,నేలకొండపల్లి సబ్ ఇన్స్పెక్టర్ పి సంతోష్, ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సహకారంతో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కట్టెకోల నాగార్జున,మాట్లాడుతూ మా గ్రామ పంచాయతీ పరిధి నుండి ప్రతి ఒక్క వాహనదారులు ప్రతి ఒక్కరు అధిక స్పీడ్ పోకుండా మరియు హెల్మెట్ ధరించాలి వాహనాన్ని క్రాస్ చేసేటప్పుడు లెఫ్ట్ సైడ్ కాకుండా రైట్ సైడ్ చూసుకుంటూ క్రాస్ చేయవలసిందిగా కోరారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరి హెల్మెట్ ధరించాలి. కోరుచున్నాము. పోలీసు వారు నిర్వహించిన రోడ్డు భద్రతా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కట్టెకోల నాగార్జున. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లతీఫ్, కానిస్టేబుల్స్.ఉపసర్పంచ్ పొట్ట పెంజర స్వాతి,అలీ, మీసా రంగారావు, షేక్ కాజా మియా, డాక్టర్ అహ్మద్, చింతలపాటి భాస్కర్,అనంతు శ్రీను, బెల్లంకొండ బుచ్చి నారాయణ, కొడాలి అచ్చు బాబు,పొట్ట పెంజర సుధాకర్, పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు..




# తిప్పారెడ్డిగూడెంలో ఘనంగా రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

- విశాలమైన స్థలం లో గుడి నిర్మాణానికి ప్రజల అంగీకారం
వేదమంత్రాల సాక్షిగా శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అర్చకులు
గ్రామస్థుల సహకారం తో ఆరు నెలల్లో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తున్న గ్రామ పెద్దలు

తిరుమలాయపాలెం ఏప్రిల్ 13
( ప్రజా వేదిక) న్యూస్ ప్రతినిధి

కూరపాటి ఉపేందర్



మండల పరిధి లోని తిప్పారెడ్డిగూడెం గ్రామం లో ప్రజల చిరకాల కోరికను సహకారం చేసేందుకు గ్రామ పెద్దలు రామాలయాన్ని నిర్మించడానికి కంకణ బద్ధులై ఆలయ నిర్మాణానికి గ్రామస్తుల సహకారంతో సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు గ్రామాల్లోని పుసులూరి రమేష్ బేబీ,పుసులూరి శ్రీనివాస్ సునీత, పుసులూరి రాకేష్.సుగుణ, పుసులూరి కృష్ణయ్య మంగతాయి, పుసులూరి రాము మమత, పుసులూరి మధు సృజన దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శంకుస్థాపన కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది గ్రామస్తులంతా జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించి దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన పుసులూరి రజిని జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఎన్నారై పుసులూరి సాకేష్ మూడు గుంటలు, ధ్వజస్తంభం ఏర్పాటుకు అంగీకరించినట్లు వారు తెలిపారు.పుసులూరి యేసయ్య జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు 30 గజాల స్థలాన్ని రామాలయానికి కేటాయించారు అని వారు తెలిపారు. రామాలయ నిర్మాణానికి గ్రామస్తులంతా సహకరించినట్లయితే ఆరు నెలల్లో రామాలయాన్ని పూర్తి చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం ఉపేందర్ ఉప సర్పంచ్ పుసులూరి రమేష్, అచ్చ బాబు, పోట్ల వాసయ్య, అచ్చ ఉప్పలయ్య మాజీ సర్పంచ్ వేల్పుల వీరన్న, వేల్పుల సైదులు, ఎల్దా శోభన్ రావు పోలే పొంగు ఉప్పలయ్య ఎంఎల్, పుసులూరి శ్రీనివాస్, సంగె పొంగు శ్రీను, వేల్పుల వెంకటేష్, పిడమర్తి రాజేష్,పేరం వెంకటేశ్వర్లు గోకినపల్లి వెంకన్న వేద పండితులు అర్చకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# చొప్పకట్లపాలెంలో గ్రామకంఠం ఖాళీ స్థలాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు....

-- కెసిఆర్ కాలనీ వాసులకు పట్టాలు ఇచ్చి, ఖాళీ స్థలాన్ని హద్దులు తేల్చి ఇవ్వాలని ఉప సర్పంచ్ పల్లా కొండలరావు డిమాండ్...

బోనకల్ ఏప్రిల్ 13 ప్రజావేదిక ప్రతినిధి (తెల్లబోయిన సుమన్)



బోనకల్ మండలం చొప్పకట్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ కంఠంలో ఉన్న ఖాళీ స్థలాలను సోమవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఆర్.ఐ వహీదా సుల్తాన్, సర్వేయర్ రవి, జి.పి.ఓ కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ పల్లా కొండలరావు, మూడో వార్డు సభ్యులు బోయినపల్లి పున్నయ్య, సిపిఎం నాయకులు చలమల అజెయ్ కుమార్, బండి శ్రీనివాసరావు లు గ్రామ పరిధిలోని కేసీఆర్ కాలనీలో, బీసీ కాలనీలో ఉన్న స్థలాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ కంఠం కు సంబంధించిన ఎటువంటి రికార్డులు లేకపోవడంతో స్థలాలపై ఎటూ తేల్చకుండా వెళ్ళారు. కేసీఆర్ కాలనీలో వాటర్ ట్యాంక్ పక్కన షుమారు 300 గజాల ఖాళీ స్థలం ఉందని, దానికి హద్దులు మాత్రం తాము తేల్చలేమని సర్వేయర్ రవి చెప్పారు. కాలనీలో 20 మందికి డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇచ్చి పట్టాలు ఇవ్వలేదని ఉప సర్పంచ్ పల్లా కొండలరావు తెలిపారు. ఇపుడు మీరు హద్దులు తేల్చనంటే భవిష్యత్తులో సమస్యలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని పల్లా కొండలరావు ప్రశ్నిస్తే మా దగ్గర ప్రస్తుతం ఆధారాలు లేవని అసంబద్ధంగా సర్వేయర్ సమాధానం ఇచ్చారు. కాలనీ వాసులకు పట్టాలు ఇచ్చి, ఖాళీ స్థలాన్ని హద్దులు తేల్చి ఇవ్వాలని ఉప సర్పంచ్ డిమాండ్ చేశారు. అలా తేల్చలేమని ఉన్న ఖాళీ స్థలంలో ఐ.కే.పీ బిల్డింగ్ లు కట్టుకోవాలని సమస్య వస్తే ఆలోచిద్దామని రెవెన్యూ అధికారులు చెప్పారు. ఐ.కె.పి కు సంబంధించిన రెండు బిల్డింగ్స్ 300 గజాల స్థలంలోనే కట్టుకోవచ్చని సర్వేయర్ చెప్పారు. వాటర్ ట్యాంక్ కు సంబంధించి 46/1 సర్వే నెంబర్ లో ఐదు ఎకరాల ఏడు కుంటల స్థలం ఉందని, అక్కడ నిర్మాణం జరపాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులకు ఇచ్చామని దీనికి హద్దులు నిర్ణయం చేసి తహశీల్దార్ కు చెబితే పట్టించుకోవడం లేదని ఉప సర్పంచ్ పల్లా కొండలరావు ఆరోపించారు. అలా ఏమీ లేదు మేము ఫిక్స్ చేసి ఇస్తామని ఆర్.ఐ వహీదా సుల్తాన్ తెలిపారు. అక్కడ తారు రోడ్డు మంజూరు అయింది రోడ్ ప్రక్కన నిర్మాణం సాధ్యమవుతుందా? అని సర్వేయర్ ప్రశ్నించారు. మాజీ సర్పంచ్ సుబ్బారావు స్థలం ఇస్తామంటున్నారు, సర్పంచ్ సంతకం పెడతానన్నారని గ్రామ సభలో జరిగిన విషయాన్ని జిపిఓ గుర్తు చేశారు. సుబ్బారావు స్వంత స్థలమా? ప్రభుత్వ భూమా? అన్నది తేల్చండని కొండలరావు కోరారు. 37వ సర్వే నెంబర్ ఇనాం భూమి అని అది సుబ్బారావు స్థలమే అవుతుందని రెవెన్యూ అధికారులు చెప్పారు. అలా అని హద్దులు తేల్చి ఇవ్వాలని, 46/1 కు కూడా రోడ్డు నిర్మాణంకు పోగా మిగిలిన స్థలం ఎంత? ఏ హద్దుల్లో ఉందనేది తేల్చాలని ఉప సర్పంచ్ పల్లా కొండలరావు డిమాండ్ చేశారు. ఇవి రెండింటినీ సర్వే చేసి హద్దులు నిర్ణయం చేస్తామని ఆర్.ఐ చెప్పారు. శ్మశానానికి సంబంధించిన స్థలం ఆక్రమణపై మరో రోజు వచ్చి పరిశీలిస్తామని, ఈరోజు తనకు ముఖ్యమైన మీటింగ్ ఉందని సర్వేయర్ రవి తెలిపారు. బీ.సీ కాలనీలో సర్వే నెంబర్లు 38, 39, 40, 41, 42,43 లలో ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లు, కొన్ని ఖాళీ ప్లాట్లు ఉన్నాయనీ, లే అవుట్ తెప్పించి వాటిని తేలుస్తామని అధికారులు చెప్పారు. మట్టా రత్నం ఇంటి ప్రక్కన ఉన్న స్థలం ప్రభుత్వానిదని, దానిని ప్రయివేట్ వ్యక్తులు అమ్ముకున్నారని మాజీ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బారావు ఫోన్ ద్వారా సర్వేయర్ కు తెలుపగా సరైన ఆధారాలు చూపకుండా ఎలా చెబుతామని, లే అవుట్ లేదా సరైన ఆధారాలు చూపితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్వే నెంబర్ 1,2,3 లు కూడా గ్రామ కంఠం భూమేనని రికార్డుల్లో ఉన్నట్లు జిపిఓ తెలిపారు. ముత్యాలమ్మ గుడి ప్రక్కన ఉన్న సర్వే నెంబర్ 6 లో 18 కుంటల భూమి గ్రామానికి చెందినదని అధికారులు తెలిపారు. మరోసారి లే అవుట్ ఆధారంగా చొప్పకట్లపాలెం గ్రామంలో సర్వే చేస్తామన్నారు. గ్రామ కంఠం రికార్డులకోసం తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులు పరిశీలన అనంతరం ఉప సర్పంచ్ పల్లా కొండలరావు విలేఖరులతో మాట్లాడుతూ కేసీఆర్ కాలనీలో సర్వే నెంబర్ 99/ఇ/1 లో భూమి కొనుగోలు చేసి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 20 డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చి పట్టాలు ఇవ్వలేదని, భవిష్యత్తులో వారికి ఎటువంటి లీగల్ సమస్యలు రాకుండా వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాటర్ ట్యాంక్ పక్కన ఖాళీ స్థలం 300 గజాలకు హద్దులు ఫిక్స్ చేయాలని కోరారు. గ్రామ కంఠం వివరాలను, బీ.సీ కాలనీ ప్లాట్లు లే అవుట్ లను గ్రామ పంచాయతీకి అప్పగించాలన్నారు. 37, 46/1 సర్వే నెంబర్లలో ఖాళీ స్థలాలను హద్దులు ఫిక్స్ చేసి ఇవ్వాలన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని హద్దులు నిర్ణయం చేసి గ్రామ పంచాయతీకి తెలుపాలని, వెంటనే ఐ.కె.పి బిల్డింగ్స్, వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిపేందుకు లీగల్ సమస్యలు లేకుండా తగిన హద్దుల్లో నిర్మాణం జరిపేందుకు రెవెన్యూ అధికారులు గ్రామ పంచాయతీకి సహకరించాలని కోరారు.

# కార్పొరేట్ కు షాక్...
# పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల టాప్

-పిండిప్రోలు జూనియర్ కళాశాల ఫలితాలతో కొత్త సందేశం..

తిరుమలాయపాలెం ఏప్రిల్ 13
( ప్రజా వేదిక ) న్యూస్ ప్రతినిధి




విద్య అంటే ఖర్చే అన్న భావనను పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తుడిచిపెట్టేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ కళాశాలల్లో చదివించినా, ప్రభుత్వ కళాశాలలో సాధించిన ఫలితాలకంటే ప్రత్యేకత లేదని తాజా ఇంటర్మీడియట్ ఫలితాలు స్పష్టం చేశాయి.పరిమిత వనరులు, సాధారణ వాతావరణం ఉన్నప్పటికీ, పిండిప్రోలు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సాధించిన మార్కులు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. క్రమశిక్షణ, పట్టుదల, ఉపాధ్యాయుల నిబద్ధత,ఈ మూడు కలిసి విజయానికి బలమైన పునాది వేశాయి.ఈ ఫలితాలు ఒక్క కళాశాల విజయమే కాకుండా, ప్రభుత్వ విద్యపై ఉన్న అపోహలకు గట్టి సమాధానంగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత ఉంటే అద్భుతాలు చేయగలరని ఈ విజయాలు నిరూపిస్తున్నాయి.

ఇక తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తు కోసం భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉందా అనే ఆలోచనలో పడేలా ఈ ఫలితాలు మార్గదర్శకంగా మారాయి. తక్కువ ఖర్చుతో, మెరుగైన విద్యను అందించే ప్రభుత్వ కళాశాలలు ఇప్పుడు మరోసారి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నాయి.

కళాశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, “విద్యార్థుల కష్టమే మా గర్వం. ప్రభుత్వ కళాశాలల్లో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని మేము నిరూపించాం” అని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణ తెలిపారు.